సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 4 । జూలై । 2023



దటీజ్ జీవీఎంసీ IIలో

గిరిప్రదక్షిణ సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చినా పారిశుధ్య సమస్య తలెత్తకుండా జీవీఎంసీ సేవలందించింది.



శభాష్ పోలీస్

గిరిప్రదక్షిణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకొన్నారు. IIలో



ఆర్థిక అంశాలపై అవగాహన

బడ్జెట్, పెట్టుబడి, క్రెడిట్ మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన ఉండాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అన్నారు. IIలో

న్యూస్‌రీల్

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు



వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్ : ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఆషాఢ పౌర్ణమి (గురుపౌర్ణమి) సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు సత్యదేవుడ్ని దర్శించుకున్నారు. వేకువజాము రెండు గంటల నుంచే క్యూలైన్లు బారులు తీరాయి. అనివెట్టి మండపం వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. సామూహిక వ్రతాలు ఆచరించారు. ఉచిత, రూ.20, రూ.200 దర్శనాలు కల్పించారు. స్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్దా మహలక్ష్మి నగేష్ చర్యలు చేపట్టారు. వన్‌టౌన్ పోలీసులు, వివిధ ఆలయాల సిబ్బంది సేవలందించారు. మధ్యాహ్నం వరకు దర్శనాలు కల్పించారు.

వైఎస్సార్ బాక్సింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు

మహారాణిపేట : వైఎస్సార్ కప్ –2023 జిల్లా స్థాయి సీనియర్స్ మెన్ అండ్ వుమెన్ బాక్సింగ్ పోటీల పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు సోమవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. జూలై 7 నుంచి 9 వరకు చంద్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా మూడు రోజులపాటు పోటీలు నిర్వహించనున్నారు. మారుతి బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్, తైక్వాండో కోచ్ ఆనంద్, విశాఖ బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు డి.రామకృష్ణారెడ్డి, మారుతి బాక్సింగ్ క్లబ్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి గోపి, బంగారు ప్రకాష్, అప్పన్న, కొల్లి సింహాచలం, రవిరెడ్డి, ఉమా మహేశ్వరరావు, పీలా వెంకట లక్ష్మి, యువశ్రీ, కృపా జ్యోతి, చొక్కర శేఖర్, బంధికాన రాధ పాల్గొన్నారు.

మైనారిటీ కార్పొరేషన్ ఈడీగా సిరాజుల్లా బాధ్యతల స్వీకరణ



సిరాజుల్లా

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సయ్యద్ సిరాజుల్లా సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎం.ఎ.రహీమ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఎఫ్ఏసీ)గా ఉండేవారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సయ్యద్ సిరాజుల్లాను పలువురు అభినందించారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ మల్లికార్జునను మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గాంధీ సెంటర్ డైరెక్టర్‌గా సీతామాణిక్యం



ఉత్తర్వులు స్వీకరిస్తున్న సీతామాణిక్యం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకురాలిగా న్యాయ కళాశాల ఆచార్యులు డాక్టర్ కె.సీతామాణిక్యం నియమితులయ్యారు. సోమవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ నుంచి ఉత్తర్వులు స్వీకరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ గాంధీ అధ్యయన కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయాలని, గాంధీజీ ఆలోచనలను యువతలోనికి తీసుకువెళ్లే దిశగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య చల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ సెజ్‌కు సిటీ బస్సు పునరుద్ధరణ

దాబాగార్డెన్స్: కరోనా కారణంగా 2020లో ఐటీ సెజ్‌కు నిలిపివేసిన సిటీబస్సును జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 5 నుంచి పునరుద్ధరించనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సులో సిటీ ఆర్డనరీ(రూ.1010), మెట్రో(రూ.1140) పాసులు గల వారిని అనుమతించనున్నట్టు తెలిపారు.

నమో..నారసింహా

గిరిప్రదక్షిణలో పాల్గొన్న 9 లక్షల మందికి పైగా భక్తులు



గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులతో కిక్కిరిసిన అడవివరం ప్రధాన రహదారి



గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకొని వచ్చిన భక్తులతో కిటకిటలాడిన తొలిపావంచా



తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొడుతూ...



భక్తులకు ఉచిత ప్రసాద వితరణ

నమో నారసింహా..సింహాద్రి అప్పన్నా.. సల్లంగ సూడాల అంటూ భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. లక్షలాది మంది భక్తులు తరలిరాగా గిరిప్రదక్షిణ దిగ్విజయంగా ముగిసింది. అధికారయంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేయడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా అప్పన్న దర్శనభాగ్యం కలగడంతో భక్తులు మురిసిపోయారు.

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని స్మరిస్తూ ఆదివారం లక్షలాది మంది భక్తులు చేపట్టిన సింహగిరి ప్రదక్షిణ సోమవారంతో ముగిసింది. సింహాచలంలోని తొలిపావంచా వద్ద ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులు సింహగిరి చుట్టూ ఉన్న 32 కిలోమీటర్ల మేర ప్రదక్షిణ చేసి తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. స్వామి సన్నిధిలో కొబ్బరికాయ కొట్టి గిరిప్రదక్షిణ ముగించారు. పలువురు భక్తులు స్వామి దర్శనానికి సింహగిరికి తరలివెళ్లారు. సోమవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు కల్పించారు. భక్తులు ఇబ్బంది పడకుండా దేవస్థానం అధికారులు రూ100, రూ.300 దర్శన క్యూల్లో కూడా ఉచితంగానే పంపించడం విశేషం. భక్తులందరికీ ఆలయ నీలాద్రిగుమ్మం నుంచే లఘు దర్శనాన్ని అందజేశారు. మధ్యాహ్నం సుమారు 12గంటల్లోపే దాదాపు భక్తులందరూ స్వామివారి దర్శనాలు పూర్తి చేసుకున్నారు.

విశేషంగా ఆలయ ప్రదక్షిణలు

ఆషాఢ పౌర్ణమి సందర్భంగా సోమవారం తెల్లవారు జామున 3గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతించారు. అప్పటికే సింహగిరికి చేరుకున్న భక్తులు ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.



గిరిప్రదక్షిణ అనంతరం సేదతీరుతున్న భక్తులు

సైడ్‌లైట్స్

- పాత గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు ఉన్న మార్గం భక్తులతో కిక్కిరిసింది. ఒక పక్క గిరి ప్రదక్షిణ పూర్తి చేసేందుకు సింహాచలం వచ్చే భక్తులు, మరో పక్క గిరిప్రదక్షిణ పూర్తి చేసుకుని తమ ఇళ్లకు చేరుకునే భక్తులతో రద్దీ నెలకుంది.
- గిరిప్రదక్షిణ ముగించి తిరిగి కొబ్బరికాయలు కొట్టే భక్తులతో తొలిపావంచా కిటకిటలాడింది.
- మెట్లమార్గంలో కొండపైకి వెళ్లే భక్తులను మాత్రమే అనుమతించారు..
- కొండదిగువకు భక్తులను చేరవేసేందుకు 35 ఉచిత బస్సులను దేవస్థానం ఏర్పాటు చేసింది. ఉచిత బస్సుల వద్ద రద్దీ ఏర్పడకుండా భక్తులను దఫదఫాలుగా పోలీసులు పంపించారు.
- 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేసి స్వామివారి దర్శనానికి సింహగిరికి వచ్చిన భక్తులను ఆలయ ఉత్తరరాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి, బయటకు వచ్చే భక్తులకు దక్షిణ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి పంపించారు.



ఆర్టీసీ బస్సుల వద్ద రద్దీ

- ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద నాలుగు లైన్లు ఏర్పాటు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు.
- భక్తులకు వైద్య సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు.
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సింహగిరిపైన, కొండదిగువ పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు.

‘గిరి’దారిలో భక్తులు మురిసి..

- గిరిప్రదక్షిణకు మునుపెన్నడూ లేని విధంగా ఏర్పాట్లు
- కిలో మీటర్‌కు ఒక మెడికల్ క్యాంపు
- 102 ప్రాంతాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత
- 2,400 మందితో పోలీస్ బందోబస్తు
- భక్తుల నడకకు వీలుగా స్వచ్ఛందంగా వాహనాలు నిలిపివేసిన వాహనాదారులు
- ఆ ఫొటోలతో అసత్యవార్తలు ప్రచురించిన ఈనాడు

సాక్షి, విశాఖపట్నం : సింహాద్రి అప్పన్న నామస్మరణతో మహా నగరం మార్మోగింది. గిరి ప్రదక్షిణకు ఊహించిన దానికంటే భక్తులు పోటెత్తారు. అడుగడుగునా సౌకర్యాలు అద్భుతంగా ఉండటంతో ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా నడక సాగించి, అప్పన్నను దర్శించుకున్నామని భక్తులంతా చెబుతున్నా ఈనాడు మాత్రం దేవుడి కార్యక్రమం పైనా విషం చిమ్మింది. ఏర్పాట్లు సరిగా లేవంటూ అడ్డగోలు రాతలతో అక్కసును వెళ్లగక్కింది. ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి.. తక్కువ మంది పోలీసులు పనిచేశారంటూ విషపు రాతలు రాసింది. వాస్తవానికి భక్తులు ఏదైనా జంక్షన్ దాటుతున్నప్పుడు వాహనదారులు స్వచ్ఛందంగానే తమ రాకపోకలను నిలిపివేసి సహకరిస్తారు. భక్తులు దాటిన తర్వాత కదులుతారు. ఈ సారి తండోపతండాలుగా వచ్చిన భక్తులను రోడ్లు దాటించే ప్రయత్నంలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించారు. దీన్ని గ్రహించలేని ఈనాడు కొట్టొచ్చినట్లు అధికారుల వైఫల్యం కనిపించిందంటూ అడ్డగోలుగా రాయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి 2017, 2018లో కేవలం 300 మంది పోలీసులతోనే గిరి ప్రదక్షిణ నడిపించారు. ఈ ఏడాది 2,400 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈసారి 9 లక్షల మందికిపైగా భక్తులు 32 కి.మీ మేర ప్రదక్షిణలో పాల్గొని స్వామిని దర్శించుకొని భక్తిపారవశ్యంలో మునిగితేలారు.



అప్పుఘర్ తీరంలో భక్తులకు సూచనలిస్తున్న పోలీసులు



గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులను రోడ్డు దాటిస్తున్న పోలీసులు

మునుపెన్నడూ లేని విధంగా...

గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పకడ్బందీగా వ్యవహరించారు. భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణతో పాటు తొలిసారిగా పారిశుధ్య నిర్వహణ కోసం డ్రోన్లు వినియోగించారు. గిరిప్రదక్షిణ దారిలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన మంచి నీరు సదుపాయం, పారిశుధ్య నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన స్టాళ్లను నిరంతరం డ్రోన్ల ద్వారా పర్యవేక్షించారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా డ్రోన్ల సహాయంతో కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ సిబ్బందిని అప్రమత్తం చేశారు. భద్రతపై నిఘాతో పాటు భక్తుల రద్దీ బట్టి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం, విజయనగరం ఇతర ప్రాంతాల నుంచి విశాఖలోకి వచ్చే అన్ని ప్రజా రవాణా, ప్రైవేటు వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నంకాలేదు. కొండపైకి సింహాచలం దేవస్థానం బస్సులు మినహా ఇతర వాహనాలను అనుమతించకపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తలేదు.

ఇవీ సౌకర్యాలు

- గిరిప్రదక్షిణ మార్గంలో ఈ ఏడాది ఏకంగా 102 పాయింట్లు ఏర్పాటు చేసి మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు.
- ప్రతి కిలోమీటర్‌కు ఒక మెడికల్ క్యాంపు అందుబాటులో ఉంచారు. వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, మందులు సిద్ధం చేశారు. ప్రతి రెండు శిబిరాలకు మధ్యలో ఒకటి చొప్పున 16 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. దాదాపు 2.1 లక్షల మందికి వివిధ రకాల వైద్యసేవలు అందించారు.
- రాత్రి సమయంలో ప్రదక్షిణలో భక్తులు ఇబ్బందులు పడకుండా రూ.7.33 లక్షలతో 369 స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటు చేశారు.
- గిరిప్రదక్షిణ మార్గంలో రోడ్లను వెడల్పు చేయడంతోపాటు కొన్ని ప్రాంతాల్లో కొత్త రోడ్లు వేశారు.

ప్రదక్షిణ అద్భుతంగా సాగింది



మాది శ్రీకాకుళం జిల్లా టెక్కలి దగ్గర ఊరు. మూడేళ్లుగా గిరి ప్రదక్షిణకు వస్తున్నాం. ఈసారి ఏర్పాట్లు మాత్రం అద్భుతంగా ఉన్నాయి. రోడ్లు కూడా బాగున్నాయి. ఎక్కడికక్కడే మంచినీరు అందించారు. కాళ్లకి చిన్న రాయి గుచ్చుకోగా కొంచెం దూరంలోనే మెడికల్ క్యాంపు దగ్గరికి వెళ్తే బాగా చూసుకున్నారు.

– **హేమంత్, రవి, శ్రీకాకుళం జిల్లా**

దేవుడు చల్లగా చూస్తాడు..



గతేడాది కన్నా ఈ ఏడాది సౌకర్యాలు బాగున్నాయి. గిరి ప్రదక్షిణ మార్గమంతా విద్యుత్ వెలుగులు విరజిమ్మాయి. పుష్కలంగా నీరు దొరికింది. ఎంత కావాలంటే అంత మజ్జిగ ఇచ్చారు. కాళ్ల నొప్పులుంటే వైద్య శిబిరాల్లో టాబ్లెట్స్ ఇచ్చారు. సేవల్లో పాల్గొన్న అందర్నీ దేవుడు చల్లగా చూస్తాడు.

– **మజ్జి నాగమణి**, పెద్ద తాడివాడ, విజయనగరం జిల్లా

ఫ్రెండ్లీ పోలీసింగ్ కనిపించింది



ఫ్రెండ్లీ పోలీసింగ్ అని వినేవాడిని... గిరి ప్రదక్షిణలో ప్రత్యక్షంగా చూశాను. ఎప్పుడూ రానంత జనం వచ్చినా.. భారీ వర్షం పడినా.. పోలీసులు మాత్రం అద్భుతంగా పనిచేశారు. జంక్షన్లలో వాహనాల వల్ల ఇబ్బందులు రాకుండా వాళ్లే రోడ్డు దాటించారు. ప్రభుత్వం తరపున మంచి నీరు, ఓఆర్ఎస్, మజ్జిగ అందించారు. ప్రభుత్వాధికారుల టీమ్ వర్క్ కనిపించింది.

– **ఈశ్వర్‌రావు, తులసి**, యల్లపువానిపాలెం

భక్తులు సంతోషం వ్యక్తం చేశారు



గిరి ప్రదక్షిణకు గతంలో కంటే రెట్టింపు స్థాయిలో ఏర్పాట్లుచేశాం. మంచినీరు నుంచి టాయిలెట్స్ వరకూ అన్నీ అందుబాటులో ఉంచాం. గిరి ప్రదక్షిణ జరుగుతున్న సమయంలోనూ నేనే స్వయంగా వివిధ పాయింట్స్ వద్ద భక్తుల్ని ఆపి.. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే చెప్పాలని అడిగాను. ప్రతి భక్తుడూ సంతృప్తికరంగా ఏర్పాట్లు చేశారనీ.. గతంలో ఎప్పుడూ ఇలా చేయలేదని చెప్పారు. గిరి ప్రదక్షిణ విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

– **డా.మల్లికార్జున, జిల్లా కలెక్టర్**

19న జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికలు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికలు ఈ నెల 19న నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. జీవీఎంసీ నిబంధనల ప్రకారం స్థాయీ సంఘానికి 10 మంది సభ్యులు ఉంటారు. ప్రస్తుత స్థాయీ సంఘ కాలపరిమితి ఈ నెల 26తో ముగియనుంది.

ఎన్నిక షెడ్యూల్ ఇలా.. : ఈ నెల 11వ తేదీ వరకూ ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల జాబితా ప్రచురిస్తారు. 12న ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లు పరిశీలిస్తారు. అనంతరం అర్హత గల నామినేషన్ల జాబితా ప్రచురిస్తారు. 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రచురిస్తారు.

నామినేషన్ పత్రాలు ఎక్కడ తీసుకోవాలి?

నామినేషన్ పత్రాలు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సెక్రటరీ విభాగం నుంచి పొందవచ్చు. పూర్తి చేసిన నామినేషన్ పత్రాలు జీవీఎంసీ అదనపు కమిషనర్ (ఫైనాన్స్) కార్యాలయంలో ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయాలి.

ఒకే రోజు ఓట్ల లెక్కింపు..ఫలితాలు

ఈ నెల 19న జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థాయీ సంఘ సభ్యుల ఎన్నిక నిర్వహిస్తారు. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో (ఇగ్నో) ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. https: //ignouadmission.samasth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ ప్రవేశాలకు దరఖాస్తు గడువు జూన్ 30 చివరి తేదీగా కాగా ఈనెల 15వ వరకు పొడిగించారన్నారు.

పలు రైళ్లు రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం : జూలై 3న ఆయా స్టేషన్లలో బయల్దేరాల్సిన పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు, అంతే ఆలస్యంగా వివిధ స్టేషన్లకు చేరుకోనున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హౌరాలో ఉదయం 10.50 గంటలకు బయల్దేరాల్సిన హౌరా - యస్ఎంవీ బెంగళూరు (22863) ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు మూడున్నర గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరింది. ఎస్ఎంవీ బెంగళూరులో ఉదయం 10.35 గంటలకు బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు – హౌరా (12864) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు మూడున్నర గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరింది. విశాఖపట్నంలో రాత్రి 7.10 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం – తిరుపతి (08583) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 9.15 గంటలకు బయల్దేరింది.

వైభవంగా గురుపౌర్ణమి

ఏయూక్యాంపస్ : గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆలయాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. వ్యాసభగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతీ ఏడాది గురుపౌర్ణమిని జరుపుకుంటారు. అదే విధంగా తాము గురువుగా భావించే వారికి నమస్కరించడం, సేవించడం, గౌరవించడం మన సంప్రదాయంగా వస్తోంది. గురుపౌర్ణమి సందర్భంగా తమ ఇష్టదైవాన్ని స్మరించుకుంటూ, దర్శించుకున్నారు. స్థానిక చినవాల్తేరులోని ఈస్ట్ షిర్డీ ఆలయంలో ప్రత్యేక అలంకరణతో సాయిబాబాకు పూజలు నిర్వహించారు. ఆలయాన్ని పుష్పాలు, ఫలాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సాయిబాబా విగ్రహం చుట్టూ వందలాది పండ్లు, ప్రసాదాలను నివేదన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబా దర్శనం చేసుకున్నారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు సాయిబాబాను దర్శించుకున్నారు. కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, మువ్వల సురేష్‌లు పాల్గొన్నారు.



బాబాకు అన్నాభిషేకం



చినవాల్తేరులోని ఈస్ట్ షిర్డీ ఆలయంలో వివిధ రకాల పండ్లు, స్వీట్లతో సాయిబాబాకు నివేదన

పరిశ్రమలపైనా విషమే!

- ఉమ్మడి విశాఖలో పనిచేస్తున్నది సీనియర్లే..
- జూనియర్లకే బాధ్యతలంటూ ఈనాడు తప్పుడు రాతలు



సాక్షి, విశాఖపట్నం: ప్రభుత్వం, అధికార యంత్రాంగంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్న పచ్చ పత్రిక ఈనాడుకు ఇప్పుడు పరిశ్రమల వంతొచ్చింది. ఉమ్మడి విశాఖలోని పరిశ్రమల పర్యవేక్షణకు సీనియర్లకు బదులు జూనియర్లే ఉన్నారంటూ అసత్య కథనాన్ని ప్రచురించింది. అందువల్లే ఈ పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయంటూ బురద జల్లింది. తాజాగా అచ్యుతాపురం సెజ్‌లోని సాహితీ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదాన్ని ఆసరాగా చేసుకుని అవాస్తవాలను వండి వార్చింది. 'తప్పు ఎవరిది'? అంటూ ఓ అసత్య కథనాన్ని ప్రచురించింది. ఇలాంటి ప్రమాదాలకు భద్రతా ప్రమాణాల తనిఖీల అంశంలో అనుభవజ్ఞులైన అధికారులుండాలని, కానీ ఎన్నో పరిశ్రమలున్న ఉమ్మడి విశాఖలో మాత్రం జూనియర్లే పని చేస్తున్నారని, ఒంగోలు, కర్నూలు, కడప లాంటి చోట్ల సీనియర్లు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొంది. వాస్తవానికి ఉమ్మడి విశాఖ జిల్లాలో పరిశ్రమల భద్రతను పర్యవేక్షించే జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి పరిశ్రమల శాఖలోనే రెండో సీనియర్ అధికారి. ఈ శాఖలో కాబోయే డైరెక్టర్ కూడా ఆయనే అవుతారని ఇతర అధికారులు చెబుతున్నారు. అలాగే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు కూడా సీనియర్ అధికారే. ప్రస్తుతం ఉన్న ఇన్‌స్పెక్టర్లలో ఆయనే సీనియర్. ఆయన సీనియారిటీని గుర్తించే శ్రీకాకుళం నుంచి విశాఖకు మళ్లీ బదిలీ చేశారని ఆ శాఖ అధికారులు ఉదహరిస్తున్నారు. విశాఖతో పోల్చుకుంటే పరిశ్రమలు అంతగా లేని కడప, కర్నూలు, ఒంగోలుల్లో సీనియర్ అధికారులే ఉన్నారని ఈనాడు కథనంలో పేర్కొన్నారు. కానీ కడప, కర్నూలుల్లో పనిచేస్తున్న ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌లు ఇక్కడి వారికంటే జూనియర్లే. కానీ వాస్తవాలకు విరుద్ధంగా ఈనాడు తప్పుడు కథనాలు రాస్తుండడంపై పరిశ్రమల శాఖ అధికారులు మండిపడుతున్నారు.

సాహితీపై గతంలోనే కేసులు

ఇటీవల ప్రమాదం జరిగిన సాహితీ ఫార్మాలో భద్రతా ప్రమాణాలు సరిగా పాటించడం లేదని తేలడంతో ఆ కంపెనీపై అధికారులు కేసు నమోదు చేశారు. సాహితీ ఫార్మాలో నైపుణ్యం లేని సిబ్బంది (అన్ స్కిల్డ్) పనిచేస్తున్నారని, ల్యాబ్ నిపుణుడు కూడా లేరని పరిశ్రమల శాఖ అధికారులు గుర్తించారు. ఇలాంటి వారి వల్ల కూడా ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, దీనిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. మరోవైపు సాహితీ ఫార్మాలో డిస్టిల్డ్ సాల్వెంట్ లోడింగ్‌లో విద్యుత్ సరఫరా హెచ్చుతగ్గుల కారణంగా తలెత్తిన లోపం వల్ల గాని, వ్యాక్యూమ్ పంప్ ఫెయిల్ అవడంతో హఠాత్తుగా ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల గాని ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనాకొచ్చారు. మరింత సమగ్రత కోసం లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి ప్రధాన కారణంపై వారం, పది రోజుల్లో పూర్తి స్థాయి నిర్ధారణకు రానున్నారు.

లోపాల పరిశ్రమలకు నోటీసులు

ఉమ్మడి విశాఖ జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల పర్యవేక్షణలో భాగంగా తరచూ సేఫ్టీ ఆడిట్‌ను నిర్వహిస్తున్నామని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇటీవల కూడా సేఫ్టీ ఆడిట్ నిర్వహించి లోపాలను సరిదిద్దుకోవాలని అనకాపల్లి జిల్లాలోని 186, విశాఖ జిల్లాలోని 53 పరిశ్రమలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని అందులో హెచ్చరించారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాల పర్యవేక్షణలో లోపం లేదని, చాలా సందర్భాల్లో ప్రమాదాలకు ఆయా సంస్థల నిర్లక్ష్యం లేదా తప్పిదాలే కారణమని వీరు చెబుతున్నారు. కాగా ఫ్యాక్టరీ నుంచి విడుదలయ్యే గాలి వల్ల గాని, వదిలిన నీరు వల్ల గాని ప్రమాదాలు వాటిల్లకుండా తాము పర్యవేక్షిస్తున్నామని, విశాఖ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ నాగిరెడ్డి 'సాక్షి'కి చెప్పారు.

అనుభవరాహిత్యం అవాస్తవం



ఉమ్మడి విశాఖ జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పర్యవేక్షించే అధికారుల్లో అనుభవం లేని వారే ఉన్నారంటూ ఈనాడులో వచ్చిన కథనంలో వాస్తవం లేదు. ఇక్కడ అత్యంత అనుభవం, సమర్థత ఉన్న ఉన్నతాధికారులే పనిచేస్తున్నారు. వీరి నేతృత్వంలో తరచూ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పర్యవేక్షిస్తున్నారు. సేఫ్టీ ఆడిట్ నిర్వహిస్తూ వాటిలో లోపాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటున్నారు. నిర్లక్ష్యం లేకుండా మా శాఖ అధికారులంతా అంకితభావంతో పనిచేస్తున్నారు.

– వి.సురేష్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, విశాఖపట్నం

లీజు కాదు.. సేల్!

- చినముషిడివాడ భూమిపై మాజీ మంత్రి బండారు అసత్యాలు
- 1992లో ప్రభుత్వానికి రూ.62,400 చెల్లించి కొనుగోలు
- కబ్జా చేశారంటూ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ నేతలపై ఆరోపణలు

సాక్షి, విశాఖపట్నం: తెలుగుదేశం పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైన, ఆ పార్టీ నేతలపైనా అసత్య ఆరోపణలు గుప్పించడమే పనిగా పెట్టుకున్నారు. అవాస్తవాలు మాట్లాడితే ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతామన్న భీతి లేకుండా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని బురద జల్లడం ద్వారా లబ్ధిపొందాలని చూస్తున్నారు. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సప్తగిరినగర్‌లో బీఆర్‌టీఎస్ రోడ్డుకు చేరువలో రూ.20 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని వైఎస్సార్‌సీపీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అధికార పార్టీ అండతో కబ్జా చేశారంటూ మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తి మీడియా ఎదుట గొంతెత్తారు. సర్వే నంబరు 123/4లోని 26 సెంట్ల ఆ స్థలాన్ని తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అయితే వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి.

1992లో కోళ్ల ఫారం ఏర్పాటు కోసం పెందుర్తి మండలం చినముషిడివాలోని ఈ స్థలాన్ని కేటాయించాలని ప్రస్తుత కార్పొరేటర్ సోదరుడు ముమ్మన శ్రీరామ్మూర్తి కమిషనర్ ఆఫ్ ల్యాండ్ రెవెన్యూ (సీఎల్ఆర్)కు దరఖాస్తు చేశారు. దీనికి ఆమోదం తెలపడంతో అప్పటి మార్కెట్ విలువ రూ.62,400 చెల్లించి కొనుగోలు చేశారు. అనంతరం ఆ స్థలాన్ని ఎమ్మార్వో 15.12.92న శ్రీరామ్మూర్తికి అప్పగించారు. ఇంతలో మట్టపల్లి జగన్నాథరావు అనే వ్యక్తి ఆ స్థలంలో తనకు ప్రొవిజన్ పట్టా ఇచ్చారంటూ 1993లో హైకోర్టుకెళ్లారు. హైకోర్టు స్టేటస్‌కో ఇస్తూ 1994లో ఈ కేసును జిల్లా కలెక్టర్ విచారణకు పంపింది. విచారణ జరిపించిన కలెక్టర్ శ్రీరామ్మూర్తికి మార్కెట్ విలువకు కేటాయింపు సరైనదేనని, జగన్నాథరావు ప్రొవిజన్ పట్టా సరికాదని తేల్చారు. దీనిపై జగన్నాథరావు 1996లో మళ్లీ సీఎల్ఆర్‌కు ఫిర్యాదు చేసినా 1997లో శ్రీరామ్మూర్తికే అనుకూలంగా ఉత్తర్వులిచ్చారు. అనంతరం జగన్నాథరావు విశాఖ సివిల్ కోర్టు కెళ్లగా అక్కడ అనుకూలంగా తీర్పు వచ్చింది. దీనిపై శ్రీరామ్మూర్తి జిల్లా కోర్టులో అప్పీలు చేయడంతో 2002లో కలెక్టర్ ఉత్తర్వులకు మద్దతుగా తీర్పునిచ్చింది. అయినప్పటికీ జగన్నాథరావు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. చివరకు 2018లో జగన్నాథరావు తన కేసును ఉపసంహరించుకున్నారు. దీంతో అప్పటికే పట్టణీకరణతో ఆ స్థలంలో కోళ్ల ఫారం ఏర్పాటు సాధ్యం కాదని, మరో వ్యాపారానికి వీలుగా నిషిద్ధ జాబితా 22ఏలో ఉన్న ఈ భూమిని దాని నుంచి తొలగించాలని శ్రీరామ్మూర్తి హైకోర్టుకు విన్నవించారు. దీనిపై 22ఏ జాబితా నుంచి తొలగిస్తూ చర్యలు తీసుకోవాలని హైకోర్టు జిల్లా కలెక్టర్‌కు సూచించింది. అనంతరం 2019లో అప్పటి కలెక్టర్ జిల్లా రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులిచ్చారు.

మార్కెట్ వాల్యూ చెల్లించి కొనుగోలు చేసిన ప్రభుత్వ భూములకు ప్రొవిజన్స్ ఆఫ్ యాక్టు 9/1977 ప్రకారం షరతులు వర్తించవని పేర్కొన్నారు. అయితే పెందుర్తి ఎమ్మార్వో మరోసారి హైకోర్టుకెళ్లినా డిస్మిస్ చేసింది. దీంతో ఇటీవల 22ఏ జాబితా నుంచి తమ స్థలాన్ని తొలగించాలని చేసిన దరఖాస్తుపై ప్రస్తుత కలెక్టర్ ఆదేశాలతో ఫిబ్రవరి 6న జిల్లా రిజిస్ట్రార్ తొలగించారని కార్పొరేటర్ దేముడు చెప్పారు.

బండారువి అసత్య ఆరోపణలు



ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశామంటూ తప్పుడు ఆరోపణలు చేసి తమ కుటుంబ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు బండారు సత్యనారాయణమూర్తిపై పరువు నష్టం దావా వేస్తాను. బండారు ఆరోపించినట్టు తాము ఆ స్థలాన్ని లీజుకు తీసుకోలేదు. మార్కెట్ విలువ చెల్లించి కొనుగోలు చేశాం. వీఎల్‌టీ కింద రూ.3.65 లక్షలు, ప్లాన్ అప్రూవల్‌కు రూ.17.86 లక్షలు చెల్లించాం. తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నామనడం అవాస్తవం. ఈ వ్యవహారంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ల హస్తం ఉందనడం బండారు దిగజారుడుతనానికి నిదర్శనం. 2019–23ల మధ్య పెందుర్తి నియోజకవర్గంలో తనతో సహా వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నట్టు ఆరోపణలపై ప్రజల సమక్షంలో ఒకే వేదికపై తేల్చుకుందాం. అలా నిరూపణైతే కార్పొరేటర్ పదవికి రాజీనామా చేస్తాను. రుజువుకాకపోతే బండారు టీడీపీకి రాజీనామా చేయాలి.

– ముమ్మన దేముడు, 95వ వార్డు కార్పొరేటర్

దటీజ్ జీవీఎంసీ

యుద్ధప్రాతిపదికన వ్యర్థాల తొలగింపు



శుభ్రం చేసిన తరువాత రహదారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు యావత్ జీవీఎంసీ సిబ్బంది పారిశుధ్య నిర్వహణలో ప్రశంసనీయమైన పాత్ర పోషించారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా 32 కిలోమీటర్ల మేర భక్తులు రోడ్లపై వేసిన చెత్తాచెదారాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించే చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం నుంచే రహదారులపై శుభ్రత స్పష్టంగా కనిపించింది. గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులు నడిచిన మార్గంలో వ్యర్థాలు యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని జోనల్ కమిషనర్లను కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. స్వయంగా శుభ్రతపై పర్యవేక్షించారు. ఆయా జోన్ల పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాయ శానిటరీ కార్యదర్శుల నేతృత్వంలో యుద్ధ ప్రాతిపదికన వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు తొలగించి.. కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌కు తరలించారు. గిరి ప్రదక్షిణకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్ వెలుగులు వంటి సదుపాయాలు భక్తులకు కల్పించారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరినీ కమిషనర్ అభినందించారు.

శభాష్ పోలీస్

దొండపర్తి : భారీ పోలీస్ బందోబస్తు, ప్రణాళిక బద్ధమైన ఏర్పాట్లతో సింహాచలం గిరిప్రదక్షిణ ప్రశాంతంగా ముగిసింది. కనీవినీ ఎరుగని రీతిలో భారీ జన సందోహం పోటెత్తినప్పటికీ ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టడంతో పోలీసులు విజయవంతమయ్యారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరిపారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం. త్రివిక్రమ్ వర్మ కమాండ్ కంట్రోల్ ద్వారా పరిశీలిస్తూ సిబ్బందికి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం ఇతర ప్రాంతాల నుంచి విశాఖలోకి వచ్చే అన్ని ప్రజా రవాణా, ప్రైవేటు వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాలేదు. కొండపైకి సింహాచలం దేవస్థానం బస్సులు మినహా ఇతర వాహనాలను అనుమతించకపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తలేదు. గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు, వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రధాన కూడళ్లలో డ్రోన్ సహాయంతో సీపీ, డీసీపీలు స్వయంగా పర్యవేక్షించారు. భక్తులు సముద్ర స్నానాలు చేసే జోడుగుల్లపాలెం, అప్పుఘర్ వద్ద పోలీసులు నిరంతర నిఘా పెట్టారు. డీసీపీ–1 విద్యాసాగర్ నాయుడు భక్తులను, సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. గిరిప్రదక్షిణను విజయవంతం చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ అభినందించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

మహారాణిపేట: బడ్జెట్, పెట్టుబడి, క్రెడిట్ మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన ఉండాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. జీ–20లో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీల్లో జిల్లా స్థాయి పోటీలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ పోటీలు జూన్ 28న క్వీన్‌మేరీ బాలికల హైస్కూల్‌లో నిర్వహించారు. ప్రథమ స్థానంలో చిట్టివలస జిల్లా పరిషత్ హైస్కూల్ చెందిన జి. ప్రవీణ్ కుమార్, జే. వెంకట కీర్తన, ద్వితీయ స్థానంలో నరవ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన వి.అనిల్ గౌతమ్, జి.సౌజన్య, తృతీయ స్థానంలో అగనంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన వి.సాహితీ, జే.జశ్వంత్ నిలిచారు. వీరికి రూ.10వేలు, రూ.7500, రూ5,000 చొప్పున కలెక్టర్ మల్లికార్జున ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ నెల 14న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రవీణ్‌కుమార్, వెంకట కీర్తన పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శర్మ , కౌన్సిలర్ ఎస్. మధుసూదన్ రావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దంపతుల కిడ్నాప్ కేసులో ఐదుగురికి రిమాండ్

సీతమ్మధార : నగరంలో భార్యాభర్తలను కిడ్నాప్ చేసిన కేసులో ఐదుగురిని ఫోర్తుటౌన్ పోలీస్‌లు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడకు చెందిన వి.లోవలక్ష్మి, పట్నాల శ్రీనివాసరావు దంపతులు నెల రోజుల క్రితం విశాఖకు వచ్చారు. ఇక్కడి గురుద్వార ప్రాంతంలో స్నేహితుడి ఇంట్లో నివసిస్తూ అక్కయ్యపాలెం ప్రాంతంలో ఉన్న శ్రీ చరణ్ రియల్ ఎస్టేట్ సంస్థలో ఎగ్జిక్యూటివ్‌గా చేరారు. గతంలో విజయవాడలో పట్నాల శ్రీనివాసరావు భూములు కొనిపెడతానని నమ్మించి జి.బ్రహ్మయ్య (విజయవాడ) నుంచి రూ.98 లక్షలు, వీర మణికంఠ(రావులపాలెం) నుంచి రూ.20 లక్షలు, సాయినిఖిల్ (విజయవాడ) నుంచి 23.5 లక్షలు వసూలు చేశాడు. అనంతరం భూములు చూపించకపోవడంతో వారు డబ్బులు వెనక్కు ఇవ్వాలని అడిగారు. ఇవ్వకపోవడంతో వారంతా విజయవాడ పడమట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో 11 నెలలు శిక్ష అనుభవించిన శ్రీనివాసరావు ఇటీవల జైలు నుంచి విడుదలై విశాఖ వచ్చి స్నేహితుడు ఇంట్లో నివసిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితులు విశాఖ వచ్చి అక్కయ్యపాలెంలోని శ్రీచరణ్ సంస్థలో పనిచేస్తున్న దంపతులు లోవలక్ష్మి, శ్రీనివాసరావును కొట్టి కారులో విజయవాడకు తరలించేందుకు ప్రయత్నించగా మార్గమధ్యలోనే కిడ్నాపర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ప్రదీప్‌రెడ్డి (విజయవాడ), సందీప్ (రావులపాలెం)తోపాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. వీరు రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఈసెట్‌లో 'గైస్' విద్యార్థుల హవా

కెమికల్ ఇంజినీరింగ్‌లో తొలి పది ర్యాంకులు వారివే...

మురళీనగర్(విశాఖ ఉత్తర): ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో (ఈసెట్) కంచరపాలెంలో ఉన్న ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. గతంలో తెలంగాణ ఈసెట్‌లో మొదటి ఆరు ర్యాంకులు సాధించిన గైస్ విద్యార్థులు... తాజాగా ఏపీ ఈసెట్ ఫలితాల్లోనూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో మొదటి పది ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ఎల్.కార్తీక్ కుమార్ (1వ ర్యాంకు), డీవీఎస్ఎస్ కేశవ (2వ ర్యాంకు), వి.శంకర్ (3వ ర్యాంకు), నాగమణి (4వ ర్యాంకు), ఇ.యోచన్ కుమార్ (5వ ర్యాంకు), అనూరాధ (6వ ర్యాంకు), ఎ.సాయికిరణ్ (7వ ర్యాంకు), జయవర్ధన్ (8వ ర్యాంకు), వర్షిత (9వ ర్యాంకు), జ్యోత్స్న ప్రియాంక (10వ ర్యాంకు) వరుసగా మొదటి పది ర్యాంకులు సాధించారు. ఈ కాలేజీ విద్యార్థులు 2021 నుంచి వరుసగా మొదటి పది ర్యాంకులు సాధించడం విశేషం. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అభినందించారు.

అప్పన్న ఆలయంలో ఢిల్లీ విజయోత్సవం



ఆలయ బేడా మండపంలో భగవత్ రామానుజాచార్యులకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం ఢిల్లీ విజయం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశిష్టాద్వైత స్థాపకులు భగవత్ రామానుజా చార్యులు తన పాండిత్యంతో ఢిల్లీ బాద్‌షాను మెప్పించిన రోజు ఆషాఢ పౌర్ణమి కావడంతో ఏటా ఆరోజు శ్రీ వైష్ణవ ఆలయాల్లో ఢిల్లీ విజయం ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా ప్రముఖ శ్రీవైష్ణవ దేవాలయమైన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఢిల్లీ విజయం ఉత్సవాన్ని నిర్వహించారు. భగవత్ రామానుజాచార్యుల ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి సాయంత్రం 4 గంటలకు ఆలయ బేడామండపంలో ఉన్న హంసమూలన అధిష్టింపజేశారు. ఆయన వైభవాన్ని కీర్తిస్తూ వైభవపారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పల్లకిలో బేడా తిరువీధి ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ,అర్చకులు, పారాయణదారులు ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీదేవి తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా తుది విడత చందన సమర్పణ

ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సోమవారం తుది విడత చందన సమర్పణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామున రెండుగంటల సమయంలో స్వామిని మేల్కొలిపి సుప్రభాతసేవ చేశారు. అనంతరం ఆలయ బాండాగారంలో భద్రపరిచిన మూడు మణుగుల చందనాన్ని తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఆరాధన, బాలభోగం, రాజభోగాన్ని నిర్వహించారు. దీంతో ఈఏడాది నాలుగు విడతలుగా చందన సమర్పణ పూర్తయింది.

నేవల్ క్లోజ్డ్ రూమ్‌లో అగ్నిప్రమాదం



క్లోజ్డ్ రూమ్ అద్దాలు పగులగొడుతున్న ఫైర్ సిబ్బంది

మల్కాపురం : నేవీవీ ప్రధాన కార్యాలయానికి అతి సమీపాన అగ్నిప్రమాదం జరిగింది. సకాలంలో అగ్నిమాపక శకటాలు రావటం, నేవల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తం కావటంతో ప్రమాద తీవ్రత తగ్గింది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పు నౌకాదళం ప్రధాన కార్యాలయం సమీపాన నేవల్ ఆఫీసర్స్, అధికారుల సమావేశాల కోసం, వేడుకలు నిర్వహించుకునేందుకు క్లోజ్డ్ అకామిడేషన్ రూమ్ ఉంది. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఈ రూమ్ నుండి తెల్లటి పొగ రావటం అక్కడి సిబ్బంది గుర్తించారు. వెంటనే వారు అధికారులకు సమాచారం ఇచ్చారు. దాంతో అక్కడికి వచ్చిన అధికారులు ప్రమాదాన్ని గుర్తించి అగ్నిమాపక కేంద్రానికి ఫిర్యాదు చేశారు. సకాలంలో ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది రూమ్ అద్దాలు పగులగొట్టి మంటలను అదుపు చేశారు. గది లోపల పొగ దట్టంగా అలుముకుని ఉండడంతో లోపలికు వెళ్లేందుకు వారు కొంత ఇబ్బంది పడ్డారు. ఘటనపై మల్కాపురం పోలీసులు విచారిస్తున్నారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమా.. లేక మరేదైనా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

భక్తి శ్రద్ధలతో గురువందన



గురువందనం స్వీకరిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: గురుపూర్ణిమ సందర్భంగా అక్కయ్యపాలెం లలితాపీఠంలో కుర్తాళం శంకరాచార్య, లలితాపీఠాధిపతులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిల చాతుర్మాస దీక్ష ప్రారంభ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పీఠ పురోహితులు మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో వ్యాస పూజ, అనంతరం సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి వారి పాదాలకు, పీఠపాదుకలకు భక్తులు క్షీరాభిషేకం, బిల్వ దళార్చన, స్వర్ణ పుష్పార్చన సేవ చేశారు. అనంతరం గురువందన సమర్పణ జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య లలితాపీఠాధిపతి పాదాలకు క్షీరాభిషేకం, బిల్వ దళార్చన, స్వర్ణ పుష్ప పూజ చేశారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి రచించిన మంత్రమూలం, గురూర్ వాక్యం గ్రంథాలను స్వామి ఆవిష్కరించారు. చాతుర్మాస దీక్ష వివరాలు, విధానాలను స్వామీజీ వివరించారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అక్కయ్యపాలెంలో పాము కలకలం



పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ కిరణ్

సీతంపేట:అక్కయ్యపాలెం రామచంద్రానగర్‌లో పద్మావతి రెసిడెన్సీలో పాము కలకలం సృష్టించింది. లిఫ్ట్ అడుగుభాగంలో పాము ఉన్నట్టు గుర్తించడంతో అపార్టుమెంట్ వాసులు భయాందోళనకు గురయ్యారు. దీంతో స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సమాచారం అందించారు. లిఫ్ట్‌ను పైకి పంపి పామును ఎంతో చాకచక్యంగా ఒడిసిపట్టడంతో అంతా ఊపిరిపీల్చున్నారు. ఆరు అడుగుల నాగజెర్రి అని ఇది అంత ప్రమాదకరమైనది కాదని కిరణ్ తెలిపారు. నగరంలో ఎక్కడైనా పాము కన్పిస్తే 88663 68899 నంబరుకు తెలియపర్చాలని కిరణ్ తెలిపాడు.

స్టీల్‌ప్లాంట్ జీఎం సుధాకర్ మృతి



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రాజెక్ట్స్ జనరల్ మేనేజర్ (ఐరన్) ఇన్‌చార్జ్ వి.సుధాకర్ గుండెపోటుతో మృతి చెందారు. వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో తిరుపతి వెళ్లిన ఆయన సోమవారం ఉదయం క్యూ కాంప్లెక్స్ లైనులో ఉండగా గుండెపోటు తీవ్రంగా వచ్చింది. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మంగళవారం ఆయన మృతదేహాన్ని విశాఖకు తీసుకురానునన్నట్టు సమాచారం. ఆయన శీలానగర్‌లో నివసిస్తున్నారు. సుధాకర్ మృతి పట్ల ఉక్కు వర్గాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. ఉక్కు అధికారుల సంఘం ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసింది.